
జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com




గురువారం | 25-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 548 పేజీలు: 4 వెల : రూ.7

# హ్యాపీ క్రిస్మస్

శ్రీకాకుళం, డిసెంబర్ 24 (వార్త): జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ సందడి నెలకొంది. చర్చిలు, విద్యుద్దీపాల వెలుగులో ధగధగ మెరిసిపోతున్నాయి. క్రీస్తు సందేశాలు, ప్రార్థనలు, భక్తి గీతాలు, నృత్యాలతో కళకళలాడుతున్నాయి. వాడవాడలా క్రిస్మస్ వేడుకలు ఉత్సాహంగా సాగుతున్నాయి. చర్చిల్లో శాంతాక్లాజ్ బొమ్మలు, ట్రీలు ఆకట్టుకుంటున్నాయి. క్రైస్తవుల ఇళ్లలోనూ కాంతులు విరజిమ్ముతున్నాయి. నగరంలోని ఆర్ట్స్ కళాశాలకు వెళ్లే దారిలో ఉన్న చర్చిలో, డగ్లస్ స్కూల్ ఆవరణలో ఉన్న చర్చి, మహిళా కళాశాల ఎదురుగా ఉన్న చర్చి, తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. పలువురు తమ తమ ఇళ్లల్లోనూ ప్రార్థనలు నిర్వహించారు. ఏసు క్రీస్తు పుట్టుకను తెలియపరిచే రీతిలో పశువుల పాకలు, వివిధ ఘట్టాలను అనేక చర్చిల్లో ఏర్పాటు చేశారు. క్రైస్తవులు ఒకరికొకరు హ్యాపీ క్రిస్మస్, మెర్రీ క్రిస్మస్ అని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నగరంలో పెద్ద ఎత్తున ప్రార్థనలు చేస్తూ ర్యాలీ చేశారు. చర్చిలన్నీ క్రైస్తవులతో కిటకిటలాడాయి.









## భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ చేసుకోండి

### జిల్లా ప్రజలకు మంత్రి, కలెక్టర్, ఎస్పీ శుభాకాంక్షలు

శ్రీకాకుళం, డిసెంబరు24 (వార్త): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని క్రైస్తవ సోదర సోదరీమణులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఈ మేరకు వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

### మానవత్వానికి ప్రతీక.. క్రీస్తు: మంత్రి



క్రిస్మస్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా క్రైస్తవ సోదరసోదరీమణులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యేసుక్రీస్తు బోధించిన ప్రేమ, కరుణ, త్యాగం, క్షమ వంటి విలువలు సమాజానికి శాశ్వత మార్గదర్శకాలని పేర్కొన్నారు. మానవత్వానికి ప్రతీకగా నిలిచిన క్రీస్తు జీవితం, ప్రతి ఒక్కరిలో సేవాభావాన్ని, సహనం, శాంతిని పెంపొందించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుందని అన్నారు. క్రిస్మస్ పండుగ ప్రపంచానికి శాంతి, సౌహార్దం, సోదరభావం అనే సందేశాన్ని అందిస్తుందన్నారు.

### ప్రేమ, శాంతి వెల్లివిరియాలి: కలెక్టర్



యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీస్తు బోధనలు సమాజంలో ప్రేమ, కరుణ, శాంతిని పెంపొందిస్తాయన్నారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

### ఆనందోత్సాహాల మధ్య పండుగ: ఎస్పీ



జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రైస్తవ సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్ జరుపుకోవాలని ఎస్పీ మహేశ్వర రెడ్డి కోరారు. దేవుని కృప అందరిపై ఉండాలని, ఈ శుభదినం కుటుంబాల్లో ఐక్యతను, ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. పండుగ వేళ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు.



## కరుణ సమాజంలో.. క్రిస్మస్ వేడుకలు



శ్రీకాకుళం, డిసెంబరు24(వార్త): శ్రీకాకుళం నగరంలోని కరుణ సమాజంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు. బుధవారం రెడ్ క్రాస్ సంస్థ,ఆర్ట్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. క్రీస్తు బోధనలు అనుసరణీయమని, పొరుగువారిని ప్రేమించాలని క్రీస్తు చెప్పారని ఆయన పేర్కొన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతూ వారియొక్క సమస్యలను తెలుసుకున్నారు. అన్నివేళలా అండగా ఉంటామన్నారు. వ్యాధిగ్రస్తులకు పెన్షన్, మరుగుదొడ్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్, రేషన్ సకాలంలో అందేలా చూస్తామన్నారు. అనంతరం 35 మంది కుష్టు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు కందిపప్పు, ఆయిల్, పంచదార, బియ్యం, చీరలు, టవల్స్, దుప్పట్లు, బట్టలు పంపిణీ చేశారు. క్రిస్మస్ కేకును కట్ చేసి పిల్లలకు తినిపించారు. క్రిస్మస్ పండగ శుభాకాంక్షలు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ పి జగన్ మోహన్ రావు, సెక్రటరీ మల్లేశ్వరరావు, , అప్ హెూల్డ్ ప్రాజెక్ట్ మేనేజర్ తిమోతి, రెడ్ క్రాస్ జిల్లా ఎం.సీ. మెంబర్లు, డాక్టర్ నిక్కు అప్పన్న, నూక సన్యాసిరావు, హరి సత్యనారాయణ, చిన్మయిరావ్, జి.రమణ, సత్యనారాయణ, చైతన్యకుమార్, ఉమా శంకర్, వెంకటరమణ, చిన్నారావు, కరుణ సమాజం కుటుంబాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## టీడీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ కమిటీ నియామకం

*** అన్ని నియోజకవర్గాలకు సమప్రాధాన్యం * తెలుగు తమ్ముళ్లలో ఉత్సాహం**

శ్రీకాకుళం, డిసెంబరు24 (వార్త): తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ కమిటీని నియమిస్తూ అధిష్టానం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అధ్యక్షుడిగా మొదలవలస రమేష్, ప్రధాన కార్యదర్శిగా పీరుకట్ల విఠల్, ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, అధికారప్రతినిధులు, కార్యదర్శులుగా తొమ్మిదేసి మందికి, ఇతర సభ్యులను నియమించింది. అన్ని నియోజకవర్గాలకు సమప్రాధాన్యమిచ్చింది. ఉపాధ్యక్షులుగా సీపాన వెంకటరమణ, పోతనపల్లి సాంబమూర్తి, గల్లి కృష్ణారావు, హనుమంతు రామకృష్ణ, పొద్దిని రత్నాలనాయుడు, గురుగుబెల్లి ఝాన్సీరాణి, గొండు వెంకటరమణ, యాళ్ల నాగేశ్వరరావు, సనపల ఢిల్లీశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎస్.సహదేవురెడ్డి, కె.వాసుదేవరావు, యు.పాండురంగారావు, ఎస్.జానకిరావు, ఎం.త్రినాథరావు, డి.రమణమ్మ, ఎ.అరుణ్‌కుమార్, ఎ.రాజశేఖర్‌రెడ్డి, ఎస్.మాధవిలను నియమించింది. అలాగే అధికార ప్రతినిధులుగా ఎం.రవికుమార్, జె.త్రివేణి, డి.హేమబాబు, వి.కామేశ్వరరావు, బి.భారతి, పి.మోహన జగదీష్, బి.లలితకుమారి, కె.సారథి, ఎన్.గోవిందరావు, కార్యదర్శులుగా కె.శ్యామల, డి.త్రివేణి, సీహెచ్ ధర్మార్జునరెడ్డి, డి.సింహాద్రి, పి.రమణ, వై.లక్ష్మణరావు, ఆర్.అర్జునరావు, బి.లక్ష్మీనారాయణ, ఎస్.రంగనాయకులు, కోశాధికారిగా ఎస్.జానకిరావు, కార్యాలయ కార్యదర్శిగా వి.ఉదయ్‌కుమార్, మీడియా సమన్వయకర్తగా జామి భీమశంకర్, సామాజిక మాధ్యమాల సమన్వయకర్తగా ప్రధాన విజయ్‌రామ్‌ను నియమిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది.

# ఎర్ర చెరువు.. కబ్జా





పలాస, డిసెంబరు24 (వార్త): పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ పరంగా ఉన్న భూములు, కాలువలు, చెరువులను సైతం భూకబ్జాదారులు.. అధికార పార్టీ నేతల అండదండలతో ఆక్రమించేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు కొందరు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పురుషోత్తపురంలో గల సర్వే నెం. 29లో సుమారు 26 ఎకరాల 50 సెంట్ల విస్తీర్ణం గల ఎర్ర (డబ్బాల) చెరువులో కొంత భాగాన్ని భూ కబ్జాదారులు ఆక్రమించేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అటు మున్సిపల్ అధికారులు గాని, ఇటు రెవిన్యూ అధికారులు కూడా పట్టించుకోకపోవడం వెనుక మతలబు ఏమిటో తెలియటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో చెరువు కబ్జా కాకుండా హద్దులు గుర్తించి హద్దులు వేసినప్పటికీ కొందరు అవేమి పట్టించుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానిక టీడీపీ నాయకుడు కనుసన్నల్లోనే ఆక్రమణలు జరుగుతున్నాయని బహిరంగ విమర్శలు ఉన్నాయి. ఈ స్థలం విలువ సుమారు అరకోటికిపైనే ఉంటుందని కొందరు చెబుతున్నారు. ప్రభుత్వ భూములు, కాలువలు, చెరువులు ఆక్రమణకు గురికాకుండా చూడాల్సిన వారే మౌనం వహిస్తుండడం పట్ల లక్షలాది రూపాయలు చేతులు మారాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి ఎర్ర చెరువు కబ్జా కాకుండా చూడాలని మున్సిపల్‌వాసులు కోరుతున్నారు.



*** చెరువు గర్భంలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు * స్థానిక టీడీపీ నాయకుడు కనుసన్నల్లోనే ఆక్రమణలు * స్థలం విలువ సుమారు అర కోటి పైనే * చోద్యం చూస్తున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు * లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు బోగట్టా**


జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జగన్నాథవలసలో పారిశుద్ధ్య మెరుగునకు చర్యలు

**- జాతీయ వార్త కథనానికి స్పందన**

**జి.సిగడాం, డిసెంబరు 24(వార్త):** చెత్త..చెత్తగా జగన్నాథవలస అనే శీర్షిక పేరిట ఈ నెల 20న ప్రచురితమైన జాతీయ వార్త కథనానికి ఎంపీడీఓ జి. రామకృష్ణారావు స్పందిస్తూ జగన్నాథవలసలో పారిశుద్ధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకొని పనులను ప్రారంభించాలని పంచాయతీ కార్యదర్శి మజ్జి ధనలక్ష్మికి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సర్పంచ్ ప్రతినిధి బాణాణ సూర్యనారాయణ చొరవతో అమె గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులతో వీధి వీధుల్లో పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. పలుచోట్ల పారిశుద్ధ్య హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. తాగునీటి బావుల్లో వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేశారు. బ్లీచింగ్ చల్లారు. అనంతరం దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ నిర్వహించారు. వీరితో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.




## వెలుగు మహిళా మార్ట్ ప్రారంభం



**నరసన్నపేట, డిసెంబరు 24(వార్త):** నరసన్నపేటలో బుధవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వెలుగు మహిళా మార్ట్‌ను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబన, సమగ్ర అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా మహిళా సంఘాలే భాగస్వాములుగా మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు ఈ మార్ట్‌లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మహిళా సంఘ సభ్యుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ వెలుగు మహిళా మార్ట్‌ను అభివృద్ధి పథంలో నడిపేలా సమిష్టిగా కృషి చేయాలని ఆయన మహిళా సంఘాల ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం, డీఆర్డీఏ పీడీ, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కూటమి నాయకులు, కార్యకర్తలు, మండల మహిళా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

## సత్యసాయి విద్యావిహార్‌లో క్రిస్మస్ వేడుకలు



**పలాస, డిసెంబరు 24(వార్త):** రామకృష్ణపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రి ప్రైమరీ విద్యార్థులు యేసుక్రీస్తు జననము గూర్చి ఒక నృత్యరూపకాన్ని చక్కగా వేసి అందరినీ అలరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ అన్ని మతాల వారిని సమభావంతో చూడటం సామాజిక ఐక్యతకు మూలమని, ఇది భారతీయ సంస్కృతిలో 'సర్వ ధర్మ సమభావ' సిద్ధాంతంతో ముడిపడి ఉందని, ఇది అన్ని మతాలను గౌరవించమని బోధిస్తుందన్నారు. సమభావ యొక్క ప్రాముఖ్యతసమభావం మతాల మధ్య సంఘర్షణలను తగ్గించి, మానవత్వాన్ని ప్రోత్సహిస్తుందని, భారత దేశంలో విభిన్న మతాల సహజీవనం దీని ద్వారా సాధ్యమవుతుందన్నారు. ప్రతి వ్యక్తిని సమానంగా చూడటం మాత్రమే నిజమైన మత ధర్మమని తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి మాట్లాడుతూ అన్ని మతాల వారిని మనము సమభావముతో చూడాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, నల్ల కల్పన, నవ్య, జగదీశ్వరి కదంబాల లలిత తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధి కూటమి ప్రభుత్వం లక్ష్యం



**పలాస, డిసెంబరు 24(వార్త):** విద్యాభివృద్ధి కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ వైశ్య డైరెక్టర్ టంకల రవిశంకర్ గుప్తా అన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు 29వ వార్డు రాజమ్మ కాలనీ పరిధిలో పలాస జూనియర్ కాలేజీలో బాత్రూములుకి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో బాత్రూములు మరమతులకు గురయ్యాయని, చాలా రోజుల నుంచి ఇబ్బంది పడుతున్నారని, కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలలకే కాలేజీలో టాయిలెట్స్ ఎంపీ లాండ్స్ నిధుల నుంచి 400000 (నాలుగు లక్షలు రూపాయలు) నిధులు మంజూరవడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. ఎం పిల్లర్స్ నిధులు మంజూరు కావడం పట్ల చాలా సంతోషకరంగా ఉందని చెప్పారు. కేంద్రం మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుకి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకి కృతజ్ఞతలు తెలుపు కుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నరసింహమూర్తి, 29వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి జోగ మల్లేశ్వరరావు, ఉన్నత పాఠశాల చైర్మన్ కోట తారక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బోరు నీరు తాగదగినదేనా?

**- గ్రామస్థుల ఆందోళన**

**సారవకోట, డిసెంబరు 24(వార్త):** తొగిరి పంచాయతీ పరిధిలో ఉన్న తర్లి గ్రామం ఆశ్రమ పాఠశాల గేట్ సమీపంలో ఉన్న బోరు నీటి పరిస్థితి స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ బోరు నుంచి వచ్చే వాడుక నీరు బయటకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో చుట్టూ మురుగునీరు నిలిచిపోతోంది. బోరు చుట్టూ నీరు నిలవడంతో దుర్వాసన వ్యాపిస్తోందని, పాఠశాలకు వచ్చే విద్యార్థులు, గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వాపోతున్నారు. ముఖ్యంగా ఇదే బోరు నీరు తాగడానికి, ఇతర అవసరాలకు వినియోగించాల్సి రావడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరు చుట్టూ నిలిచిన మురుగునీరు బయటకు వెళ్లేలా డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని, నీటి నాణ్యతను పరీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని వారు హెచ్చరిస్తున్నారు.



# తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

**- వైస్సార్సీపీపై కూటమి నేతల ధ్వజం**



**నరసన్నపేట, డిసెంబరు 24(వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వైస్సార్సీపీ నాయకులు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు తీవ్రంగా విమర్శించారు.

బుధవారం నరసన్నపేట పార్టీ కార్యాలయంలోని ప్రజాసదన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న పనుల వద్ద ఫోటోలు తీసి, అవి గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతో చేపట్టినవని ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. డిస్ట్రిబ్యూటీ కమిటీ చైర్మన్ మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, భైరి భాస్కరరావు మాట్లాడుతూ, పోలాకి మండలంలో చీడివలస నుంచి దేశవానిపేట వరకు నిర్మిస్తున్న రహదారి పనులపై వైస్సార్సీపీ ఎంపీపీ ప్రతినిధి తప్పుడు కథనాలు చెబుతున్నారని ఖండించారు. 30-04-2025 తేదీన జీఓ ఆర్‌టీ నెం.309 (%ెూ=ద=ఔ%) ప్రకారం, శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి సహకారంతో నాబార్డ్ నిధుల నుంచి కోటి రూపాయలతో ఈ రహదారి పనులు మంజూరయ్యాయని స్పష్టం చేశారు. ఇప్పటివరకు సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి కొంతమంది ఓర్వలేక తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని విమర్శించారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, గత ఎన్నికల్లో ఇచ్చినట్టుగానే రానున్న ఎన్నికల్లో కూడా తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇకనైనా వైస్సార్సీపీ నేతలు విషప్రచారాలు మానుకుని, ప్రతిపక్ష హోదాకు తగిన విలువలతో వ్యవహరించాలని, అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, రాష్ట్ర పొందర కూరకుల చైర్మన్ దామోదర్ నర్సింహులు, డిస్ట్రిబ్యూటీ కమిటీ చైర్మన్ మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, శిమ్మ చంద్రశేఖర్, మండల అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, సీనియర్ నాయకులు సూరపు నారాయణదాసు, ఉపాధ్యక్షులు సాసుపల్లి కృష్ణబాబు, పట్టణ అధ్యక్షులు కింజరాపు రామారావు, తెలుగు యువత అధ్యక్షులు రావాడ గణపతిరావు, బలగ ప్రహర్ష, మాజీ ఎంపీటీసీ యాళ్ల అసిరినాయుడు, వార్డు సభ్యుడు గోలివి రామారావు తదితరులు పాల్గొన్నారు.


## లేగ దూడల పెంపకంతోనే పాడి అభివృద్ధి

**- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**



**పోలాకి, డిసెంబరు 24(వార్త):** పోలాకి మండలంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశు గణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ, గత ప్రభుత్వం పాడి పశువుల సంరక్షణను విస్మరించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాడి పశువుల సంరక్షణ, అభివృద్ధిని లక్ష్యంగా దృఢ సంకల్పంతో ఈ తరహా కార్యక్రమాలను ప్రారంభించిందన్నారు. నేటి లేగ దూడలే రేపటి పాడి సంపద అని పేర్కొంటూ, రైతులు మేలు జాతి ఆడ దూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రభుత్వం లింగ నిర్ధారిత వీర్యం (ఎస్‌ఎస్‌ఎస్)ను సబ్సిడీతో కేవలం రూ.150కే అందిస్తోందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని ఆడ దూడల సంఖ్య పెంచుకోవాలని ఎమ్మెల్యే కోరారు. లేగ దూడల ప్రదర్శనలో ఉత్తమ జాతి లేగ దూడలను పెంచుతున్న రైతులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఎసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, సూరపు నారాయణ దాసు, సర్పంచ్ తర్ర లక్ష్మినారాయణ, భైరి వెంకట్రావు, చిట్టి సింహాచలం, రావాడ గణపతిరావు, భైరి అచ్చెన్నాయుడు, పైల రాజేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏడీ, ఏవీహెచ్, పోలాకి మండల పశువైద్యాధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాడి రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి



**నరసన్నపేట, డిసెంబరు 24(వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటి పన్నులను పూర్తిస్థాయిలో ఆన్లైన్ విధానంలో వసూలు చేయాలని జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారి గోపి బాల స్పష్టం చేశారు. బుధవారం నరసన్నపేట మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించి, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వీడాలని, ప్రత్యేకంగా ఇంటి పన్నుల ఆన్లైన్ వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే నాన్ టాక్స్ పనులపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపి, వాటికి సంబంధించిన వసూళ్లను సైతం త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా వసూళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆదాయ వనరులు పెంచడంలో పంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవోలు రమేష్, పి. ద్రాక్షాయిని, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అల్లాడ ఉన్నత పాఠశాలలో శక్తి యాప్‌పై అవగాహన

**జలుమూరు, డిసెంబరు 24(వార్త):** అల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్ చట్టాలు, భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శక్తి టీం-4కు చెందిన శ్రీనివాస్, యశోద ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే విధానం, దాని ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. పోక్సో చట్టం, సైబర్ నేరాలు, మహిళలు, బాలికల సంరక్షణకు సంబంధించిన చట్టాలపై క్లుప్తంగా అవగాహన కల్పించారు. ఇటీవలి కాలంలో పెరుగుతున్న ఆన్లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులు భద్రతపై జాగ్రత్తలు పాటిస్తూ, అవసరమైన సందర్భాల్లో శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ పాల్గొన్నారు.




## రాష్ట్రస్థాయి ఆంగ్ల వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో సిద్ధికకు ప్రథమస్థానం




**పలాస, డిసెంబరు 24(వార్త):** భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి శతవర్ష జయంతి వేడుకలు సందర్భంగా శ్రీ సత్యసాయి సేవాసంస్థలు ఆంధ్రప్రదేశ్ వారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాష్ట్రస్థాయి ఆంగ్ల వ్యాసరచన పోటీలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకొన్న రామక్రిష్ణపురములో ఉన్న శ్రీ సత్యసాయి విద్యావిహర్ 10వ తరగతి విద్యార్థిని సిద్ధికకు బుధవారం రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు మెమొంటో, సర్టిఫికెట్ అందజేశారు.

## 26న బుడితి పరిధిలో విద్యుత్ నిలుపుదల



**జలుమూరు, డిసెంబరు 24(వార్త):** బుడితి 33/11 కేవీ ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం (తేదీ: 26-12-2025) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టెక్కలి శ్రీ ఈ. నరసింహకుమార్ తెలిపారు. 33 కేవీ బుడితి ఫీడర్‌పై లైన్ మార్పిడి పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ విద్యుత్ నిలుపుదల సమయంలో బుడితి, అవలంగి, లక్ష్మీపురం, చీడిపూడి, తొగిరి, కిన్నెరాడ, బద్రి, గుమ్మపాడు, అక్కివలస, బైదలాపురం, గోపాలపురం, శ్రీముఖలింగం, నగిరి కటకం, అచ్చుతాపురం, యలమంచిలి, కోమనపల్లి, అక్కురాడ, మర్రివలస, ఆంధవారం, రామకృష్ణాపురం, రామదాసుపేట, పర్లం, పర్లం మాకివలస, పగోడు తదితర గ్రామాలతో పాటు పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. విద్యుత్ పనుల నిర్వహణకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.


## వైసీపీకి సంబంధం లేని వ్యక్తి దువ్వాడ



**నరసన్నపేట, డిసెంబరు 24(వార్త):** వైసీపీకి.. దువ్వాడ శ్రీనివాస్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఆయన చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని రాష్ట్ర వైసీపీ కాళింగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు అరంగి మురళీధర్ స్పష్టం చేశారు. బుధవారం నర సన్నపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, జగనన్న జన్మదిన వేడుకల సంద ర్భంగా తమ పార్టీ అభిమానులపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వక్రీకరించిన వీడియోలు ప్రచారం చేయడం ఖండనీయమన్నారు. తమ అభిమాని ధర్మాన కృష్ణదాస్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు తమ్మినేని సీతారాంపై ఆరోపణలు చేశారంటూ దువ్వాడ శ్రీనివాస్ చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు దూరమని మురళీధర్ తెలిపారు. వైసీపీలో శ్రీనివాస్‌కు ఎలాంటి గుర్తింపు, బాధ్యతలు లేవని స్పష్టంచేశారు. పార్టీ ప్రతిష్ఠను దెబ్బ తీసేలా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ శ్రేణులు ఇటువంటి వక్రీకరణలను పట్టించుకోకుండా, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించాలని అరంగి మురళీధర్ పిలుపునిచ్చారు.

## క్రిస్మస్ వేడుకలకు చర్చిల ముస్తాబు

**ఇచ్ఛాపురం, డిసెంబరు 24(వార్త):** ఏసుక్రీస్తు జన్మదినం క్రిస్మస్ సందర్భంగా ఇచ్ఛాపురం లో పలు చర్చి లు సుందరంగా ముస్తాబు చేశారు.రంగులు తో అలంకరించారు.ధగ ధగ లాడే మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో చర్చి లు వెలుగులు విరజిమ్ముతున్నాయి.గొల్ల వీధి ఆంధ్రా బాపిస్టు చర్చి, మండపల్లి ఆంధ్రా బాపిస్టు చర్చి లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.




జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**పలాస, డిసెంబరు 24(వార్త):** బాల్య వివాహాలు చట్టరీత్య నేరమని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి వెల్లడించారు. అల్లుకోలాలో బుధవారం రాత్రి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ, సైబర్ క్రైమ్ మోసాలు, నారీ శక్తి అవేర్నెసస్, మహిళా భద్రత, బాల్య వివాహాలు తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ'ప్రోహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 ప్రకారం బాలికల వయసు 18, బాలురు 21 ఏళ్లు కావాలి, దీనిని ఉల్లంఘించితే శిక్ష విధించబడుతుందని తెలిపారు. కేంద్రం 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' 100 రోజుల అవగాహన కార్యక్రమం ..పాఠశాలలు, మత నాయకులు, పంచాయతీల్లో నిర్వహిస్తోందని, ఆంధ్రప్రదేశ్‌లో అక్షయ తృతీయ వంటి ఉత్సవాల సమయంలో మత పెద్దలకు అవగాహన కార్యక్రమాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. సైబర్ నేరగాళ్లు డబ్బు డిమాండ్ చేస్తారని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు, మెసేజులు క్లిక్ చేయకండని, సమాచారం ధృవీకరించుకోవాలని, పబ్లిక్ వైఫైలో బ్యాంకింగ్ చేయకండని, ఖాతా లావాదేవీలు తరచూ చెక్ చేయవద్దని, త్వరగా డబ్బు పంపమని ఒత్తిడి చేస్తే నమ్మకండని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ పోలీసులు, అల్లకోలా గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# దొంగలు బాబోయ్..దొంగలు

### -నరసన్నపేటలో వరుసగా చోరీలు..

### -అర్ధరాత్రి దొంగతనాలతో ప్రజల్లో భయాందోళన

**నరసన్నపేట, డిసెంబరు 24(వార్త):** నరసన్నపేటలో వరుసగా చోటు చేసుకుంటున్న చోరీలు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి. మండల కేంద్రంలోని పల్లిపేట జంక్షన్ వద్ద బుధవారం తెల్లవారుజామున కిరాణా షాపు, పాన్ షాపుల తాళాలు పగలగొట్టి దుండగులు నగదు, సరుకులు అపహరించిన ఘటన కలకలం రేపింది. ఉదయం షాపులు తెరవడానికి వచ్చిన యజమాని శ్రీరామ్ మూర్తి చోరీని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అలాగే మంగళవారం రాత్రి నరసన్నపేట పట్టణంలో ఒకేసారి పలు చోట్ల దొంగతనాలు జరగడం గమనార్హం. పల్లిపేట జంక్షన్‌లోని కిరాణా షాప్‌తో పాటు ప్రధాన రహదారిలో ఉన్న రామాలయం, ఎరువుల షాపు, మద్యం షాపుల్లో కూడా చోరీలు జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకే రాత్రిలో నాలుగు చోట్ల చోరీలు జరగడంతో పట్టణ ప్రజలు ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకుని పరిశీలన చేపట్టారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై శేఖర్రావు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వరుస దొంగతనాల నేపథ్యంలో వ్యాపారులు, స్థానికులు భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీసు గస్తీని మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు చోరీలకు పాల్పడుతున్న దుండగులను త్వరితగతిన పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలో శాంతి భద్రతలు పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.





## రోటరీ చైర్మన్, ఫార్మసిస్ట్‌కు సన్మానం



**ఇచ్ఛాపురం, డిసెంబరు 24(వార్త):** రోటరీ క్లబ్ ఇచ్ఛాపురం ఆధ్వర్యంలో పల్స్ పోలియో ప్రోగ్రాం శత శాతం పూర్తి చేసినందుకు..వారి సేవలను గుర్తించి క్లబ్ చైర్మన్ డి.మధుకుమార్, బెల్లుపడ ఫార్మాసిస్ట్ టెంకాల రఘునాథ రావుకి రోటరీ చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.త్రినాథ రెడ్డి, పల్స్ పోలియో రీజనల్ చైర్మన్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ డి. కృష్ణ మూర్తి రెడ్డి, ప్రెసిడెంట్ టి.మోహన్ వెంకటేష్ రెడ్డి, సెక్రటరీ కె.రామకోటి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కె.గోపిచౌదరి, యు.శ్యాం రెడ్డి, కిరణ్‌కుమార్, వైద్య సిబ్బంది, రఘుబాబు పాల్గొన్నారు.

## తిరుపతి నృత్యోత్సవానికి ఇచ్ఛాపురం కళాకారులు



**ఇచ్ఛాపురం, డిసెంబరు 24(వార్త):** తిరుపతి నృత్యోత్సవం 2025- 3వ భారత్ కల్చరల్ డాన్స్ ఫెస్టివల్ ఈ నెల 25 నుంచి 27 వరకు జరుగుతున్నాయి. అవార్డు 2025 శ్రీకృష్ణ నాట్య మధుబాల -శ్రీకృష్ణ నాట్య ముద్రిత తిరుపతిలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి స్వేచ్ఛా నృత్య తరంగిణి బృందం ప్రయాణమయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న నాట్య కళాకారులు డి శిరీష పట్నాయక్, టీ చైత్ర, భవ్య శ్రీ, జై మాన్విష, డి.యశోద. బి.యశ్విత. కే.శ్రావణిలు నాట్య ప్రదర్శనలో పాల్గొననున్నారు. కళాకారులకు నాట్య గురువు మంగి దివ్య, అకాడమీ అధ్యక్షులు కె.గోవిందరావు, కోశాధికారి మంగి దాలమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమాలు మహతి ఆడిటోరియం తిరుపతిలో జరగనున్నాయి.

## సౌతిండియా సైన్స్ ఫెయిర్‌కు మోడల్ స్కూల్ విద్యార్థి



**సోంపేట, డిసెంబరు 24(వార్త):** సోంపేట ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి దుంపల కృష్ణవర్ధన్ రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ లో వ్యక్తిగత విభాగంలో దక్షిణ భారత సైన్స్ ఫెయిర్ కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దుంపల చిన్నాజీ వర్మ తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ వర్ధన్ ను పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని కోరారు.

## కొర్లాంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



**సోంపేట, డిసెంబరు 24(వార్త):** కొర్లాం గ్రామ పరిధిలో గల నూకలూరు బి.కొర్లాం హుకుంపేట గొనకపాడు లక్ష్మీపురం గ్రామాల్లో విద్యుత్ సమస్యలు న్నాయని వాటిని తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని బుధవారం ఇచాపురం నియోజక వర్గ శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ డా. బెందాలం అశోక్ ను కోరలాం గ్రామ పంచాయతీ తరుపున వినతి పత్రం అందజేశారు. గ్రామపంచాయితీలో లోవోల్టేజీ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి రాంబుడ్డి గణపతి ఉప సర్పంచ్ తామాడ వాసుదేవరావు మాజీ ఎంపీటీసీ రత్నాల వెంకటరమణ కొర్లాం తెదేపా అధ్యక్షుడు పెద్దింటి రాజేశ్ నూకల పున్నయ్య పెద్దింటి శ్రీను సివంగి సంతు పాల్గొన్నారు.

### పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించాలంటూ..

## క్షేత్రస్థాయిలో పోరాటం

### - పలు గ్రామాల్లో జిల్లా సాధన కమిటీ బృందానికి విశేష ఆదరణ

### -'దువ్వాడ' ఆధ్వర్యంలో క్యాలెండర్.. స్వీట్స్ బాక్సుల పంపిణీ



**పలాస, డిసెంబరు 24(వార్త):** జిల్లా కేంద్రంగా పలాసను ప్రభుత్వం ప్రకటించాలంటూ ప్రముఖ న్యాయవాది, సామాజిక వేత్త, జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ ( బాబా) నేతృత్వంలో కొనసాగుతున్న ప్రజా ఉద్యమానికి క్షేత్రస్థాయిలో కూడా విశేష ఆదరణ లభిస్తుంది. బుధవారం పలాస మండలం కేదారిపురం, ఈదురపల్లి, గోదారి పేట, చినంచల, రాజగోపాలపురం, అల్లుకోల, కంబిరిగాం, నారాయణపురం, బ్రాహ్మణ తర్ల, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించాలంటూ నూతన సంవత్సర క్యాలెండర్, స్వీట్ బాక్స్ చొప్పున ఇంటింటా పలాస జిల్లా సాధన కమిటీ బృందంచే ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు పలాస జిల్లా కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించే వరకు తాము సంపూర్ణంగా మద్దతు తెలుపుతామని, అందుకు ఎటువంటి పోరాట ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నామంటూ వివిధ గ్రామస్తులు సాధన కమిటీ బృందానికి అండగా నిలుస్తామంటూ హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా సుదీర్ఘ స్వప్నంగా ఉన్న పలాసను జిల్లా కేంద్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, అందుకు ఈ కమిటీకి సారథ్యం వహిస్తున్న దువ్వాడ శ్రీధర్ (బాబా)తో కలిసి ప్రయాణం చేయడానికి అన్నివేళలా అందుబాటులో ఉంటామని పలు గ్రామాలకు చెందిన గ్రామ పెద్దలు, మహిళలు, యువత, వ్యవసాయ కూలీలు, రైతులు, విద్యార్థులు తగు రీతిలో హామీ ఇచ్చారు. 2026 నాటికి మరింత స్థాయిలో ఈ ఉద్యమ పోరాటాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు దువ్వాడ శ్రీధర్ (బాబా) కార్యాచరణకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజలు మద్దతు లభించడం విశేషం.

## 26న వీహెచ్‌పీ నిరసన ర్యాలీ

**శ్రీకాకుళం, డిసెంబర్24(వార్త):** బంగ్లాదేశ్‌లోని హిందువులపై దాడులకు నిరసనగా శ్రీకాకుళం ఏడు రోడ్ల జంక్షన్ వద్ద ఈనెల 26న సాయంత్రం నాలుగున్నర గంటలకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నామని విశ్వ హిందూ పరిషత్ శ్రీకాకుళం జిల్లా బాధ్యులు తెలిపారు. హింసను, పరిపాలనా నిర్లక్ష్యాన్ని ఖండించడానికి, హిందూ వ్యతిరేక హింసను నిలిపివేయాలన్నారు.

# అన్నపూర్ణమ్మ ఆలయ స్థలం ఎవరికీ ఇవ్వొద్దు

### -రెవెన్యూ అధికారులకు కోరిన మందస నాయకులు



**మందస, డిసెంబరు 24(వార్త):** మందసలోని గ్రామదేవత అన్నపూర్ణమ్మ ఆలయం ముందు ఉన్న గ్రామకంఠంకి చెందిన స్థలంలో కుల, సామాజిక వర్గాలకు, సంఘ భవనాలకు, ఇతర వ్యక్తులకు వ్యక్తిగతంగా మంజూరుకు అనుమతులు ఇవ్వవద్దని మందస డిప్యూటీ తహసీల్దార్ ఆర్.రామకృష్ణకు మందస మేజర్ పంచాయతీ సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, లక్ష్మణమూర్తితో పాటు ఆలయం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అన్నపూర్ణమ్మ గ్రామదేవత ఆలయం ముందు ఉన్న గ్రామ పంచాయతీకి చెందిన ఖాళీగా ఉన్న గ్రామకంఠం స్థలాన్ని ప్రతీ రోజు ఆలయానికి వచ్చే భక్తులు వాహనాలను, చెప్పులు పెట్టుకోవడానికి వినియోగిస్తారు. ప్రతీ ఏడాది మే నెల 26వ తేదీన జరిగే ఈ ఆలయం వార్షికోత్సవానికి కార్యక్రమాలు జరపడానికి ఏర్పాట్లు ఇదే స్థలం వద్ద చేస్తున్నారు. ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే గ్రామ దేవత ఉత్సవాలకు ఇక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈ గ్రామకంఠం స్థలం మీదుగా ఆలయం వెనుక ఉన్న దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన సుమారు ఒక ఎకరా స్థలంలో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుంటాయని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ దారి మీదుగా వాహనాలు కూడా వెళ్తుంటాయి. గ్రామదేవత సంబరాలకు వచ్చే లక్షలాదిమంది ప్రజలు సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించడానికి ఇదే రహదారి మీదుగా వెళ్లాలి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ స్థలంలో కుల సామాజిక వర్గాలకు సామాజిక భవనాలు నిర్మాణం కోసం రెవిన్యూ శాఖ అనుమతులిస్తే ఆలయానికి వచ్చే భక్తులకు పూర్తిగా అసౌకర్యం కలుగుతుందని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆలయం అభివృద్ధి కూడా కుంటుపడుతుందని ఆలయం ప్రాంగణంలో జరిగే కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడుతుందని, భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. ఈ స్థలాన్ని తమ శాఖకు చెందిన సర్వేయర్లు సర్వే చేశారని, ఈ విషయాన్ని తమ దృష్టికి తెచ్చేందుకు ఈ వినతి పత్రాన్ని అందజేశామని వారు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆలయం ముందు భాగాన ఉన్న ఈ స్థలంలో కుల సామాజిక వర్గాల వారికి గాని వ్యక్తిగతంగా గాని రెవిన్యూ శాఖ పరంగా మంజూరుకు అనుమతులు ఇవ్వవద్దని ఆలయం అభివృద్ధికి తమ శాఖ సంపూర్ణ సహకారాన్ని అందించాలని ఆ వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, లక్ష్మణమూర్తితో పాటు శ్రీనివాస పాడి, ప్రభాకర్ పట్నాయక్, బి.సాంబమూర్తి, వి.వి.రమణమూర్తి, మల్లారెడ్డి రాజు, తలగాన హరికృష్ణ, పొందర దుద్దిష్టి పాత్రో, అల్లాడ తాతయ్య, అల్లాడ ఈశ్వరరావు, జగన్నాథబెహరా, ఆలయం అర్చకుడు గోవిందు కహాల్య తదితరులు ఉన్నారు. వినతిపత్రంపై గ్రామంలోని గ్రామ పెద్దలు, ప్రముఖులు సుమారు 50 మంది వరకు సంతకాలు చేశారు.

# డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నౌపడలో ర్యాలీ


### -డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి - టెక్కలి సీఐ శ్రీనివాసరావు



**సంతబొమ్మాళి, డిసెంబరు 24(వార్త):** ఆంధ్ర ప్రదేశ్ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాయకరావుపేట నుండి ఇచ్ఛాపురం వరకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో బుధవారం నౌపడ పోలీస్ స్టేషన్ పరిధిలో అభ్యుదయ సైకిల్ యాత్ర నిర్వహించారు.

"జీవితం చాలా విలువైనది, డ్రగ్స్ బారిన పడకండి అనే నినాదంతో సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, పోలీస్ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సైకిల్ యాత్రలో భాగంగా నౌపడ పోలీస్ స్టేషన్ నుండి బస్టాండ్ కూడలి వరకు భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అవగాహన కల్పించేందుకు టెక్కలి సిఐ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు వ్యక్తిని మాత్రమే కాదు, కుటుంబాన్ని సమాజాన్ని పూర్తిగా నాశనం చేస్తాయని, డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో యువత, విద్యార్థులు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ నిర్మూలనకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేస్తూ, ప్రజలు ఎక్కడైనా డ్రగ్స్ అక్రమ రవాణా లేదా వినియోగంపై సమాచారం ఉంటే ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ హేమ సుందర రావు, నౌపడ సంతబొమ్మాళి ఎస్సైలు నారాయణ స్వామి, సింహాచలం, నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు భాను ప్రకాష్, కూటమి నాయకులు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు,



## స్థానిక ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలి



**ఇచ్ఛాపురం, డిసెంబరు 24(వార్త):** ఇచ్ఛాపురంలోని తులసమ్మ తల్లి ఆలయం ప్రాంగణంలో మండల తెలుగుదేశం నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడు లోపింటి పద్మనాభం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పంచాయతీల వారీగా పంచాయతీలకు సంబందించి పలు విషయాలు గురించి మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థలు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, పిఏసిఎస్ అధ్యక్షులు బాబ్జి, మండల సెక్రటరీ డి.కామేష్.మాజీ ఏఎంసి సాడి సహదేవ్, డి.సూర్యనారాయణ, బోర ప్రసాద్, హరీష్, ఎర్రయ్య, లోహిదాస్, చంద్రశేఖర్, ఆశి మాధవ్, కురేష్, కృష్ణ, కూర్మయ్య, సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



**సోంపేట, డిసెంబరు 24(వార్త):** కంచిలి మండలం చిన్నకోజిరియా పంచాయతీలో ఉజ్వల పథకం కింద లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోనప కృష్ణమూర్తి మాదిన రామారావు పిలక చినబాబు ముద్దపు రమణమూర్తి ముద్దపు ధర్మారావు ఎర్ర భీమారావు బండి రమేష్ తదితరులు పాల్గొని వారి చేతుల మీదుగా అందజేశారు. పూర్తి ఉచితంగా అందిస్తున్న ఇటువంటి పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సేవలను గుర్తించాలని కోరారు.

## కళాశాలల్లో వినియోగదారుల దినోత్సవం




**సోంపేట, డిసెంబరు 24(వార్త):** సోంపేట, కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బుధవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి విద్యార్థుల ర్యాలీలను నిర్వహించారు. సోంపేట ప్రిన్సిపాల్ మోహన్ రావు, కవిటి ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ ఉగాది నాయుడు విద్యార్థులకు వినియోగదారుల హక్కుల పై అవగాహన కల్పించారు. వినియోగదారులు మోసపోకుండా ప్రభుత్వాలు చట్టాలను రూపొందించాలని వాటి పట్ల అవగాహన కలిగి హక్కులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

## నిత్యవసర సరుకుల పంపిణీ

**శ్రీకాకుళం, డిసెంబర్24(వార్త):** కష్టాల్లో ఉన్న వారికి రెడ్‌క్రాస్ సంస్థ అన్నివేళలా అండగా ఉంటుందని ఆ సంస్థ జిల్లా చైర్మన్ పి.జగన్ మోహన్ రావు భరోసా ఇచ్చారు. బుధవారం శ్రీకాకుళం నగరంలోని కరుణ సమాజంలో రెడ్‌క్రాస్, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. తొలుత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంత రం క్రిస్మస్ కేక్ కట్ చేసి పిల్లలకు, పెద్దలకు తినిపించారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రావు 36 మంది కుష్టు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు రెడ్‌క్రాస్, ఆర్ట్స్ సంస్థల సహకారంతో నిత్యా వసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ మల్లేశ్వర రావు, అప్‌హోల్డ్ ప్రాజెక్ట్ మేనేజర్ తిమోతి, ఎం.సి. మెంబర్లు డాక్టర్ నిక్కు అప్పన్న, నూక సన్యాసిరావు, హరి సత్యనారాయణ, చిన్మయిరావ్, జి.రమణ, సత్యనారాయణ, చైతన్యకుమార్ పాల్గొన్నారు.

# పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభకు ప్రత్యేక దృష్టి

**జలుమూరు, డిసెంబరు 24(వార్త):** పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో అన్ని విధాల కృషి చేస్తున్నామని ఎంఈఓ-2 ఎం.వి.ఆర్.ఎస్. ప్రసాదరావు తెలిపారు. జలుమూరు మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న గణితం ప్రత్యేక తరగతులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యాశాఖ ఆదేశాల మేరకు రూపొందించిన 100 రోజుల ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తూ, బలహీన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. గణితం వంటి కీలక విషయాల్లో విద్యార్థుల అవగాహన పెంపొందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు పరీక్షల పట్ల ఆత్మవిశ్వాసం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# తీర ప్రాంత రక్షణకు పటిష్ట ప్రణాళిక

**✻ శ్రీకాకుళం నియోజకవర్గంలో ఎన్ఐఓటీ బృందం విస్తృత పర్యటన ✻ తీర కోత నివారణకు బ్రేక్ వాల్, రక్షణ గోడ నిర్మాణాలు చేపట్టండి ✻ బృందాన్ని కోరిన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్**



**శ్రీకాకుళం, డిసెంబర్24(వార్త):** తీర ప్రాంత గ్రామాల్లో ఏళ్ల తరబడి నెలకొన్న భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే కాకుండా, సముద్ర కోత నుంచి గ్రామాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని సాంకేతిక చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. బుధవారం శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లోని సముద్రతీర ప్రాంతాల్లో చెన్నైకి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ బృందం పర్యటించింది. ఎమ్మెల్యే స్వయంగా వారితో కలిసి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. గార మండలం మొగదలపాడు గ్రామం దీర్ఘకాలంగా రెవెన్యూ మ్యాప్‌లో లేకపోవడం వల్ల అభివృద్ధికి దూరమైందని ఎమ్మెల్యే బృందానికి వివరించారు. ఈ గ్రామాన్ని కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సీఆర్‌జడ్) పరిధి నుంచి వేరు చేసి, రెవెన్యూ మ్యాప్‌లో నమోదు చేసేందుకు ఎన్ఐఓటీ బృందం సర్వే చేపట్టింది. హద్దుల నిర్ణయం కోసం రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. తీర కోతపై ప్రత్యేక దృష్టి బందరువానిపేట తీరంలో ప్రమాదాల నివారణకు బ్రేక్ వాల్ నిర్మాణం, కళింగపట్నం బీచ్‌లో రక్షణ గోడ ఏర్పాటుపై అధికారులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. వంశధార నది సముద్రంలో కలిసే చోట ఆక్రమణల వల్ల ప్రవాహ దిశ మారిందని, దీనివల్ల వాడపల్లి వంటి గ్రామాలు కోతకు గురవుతున్నాయని బృందం దృష్టికి తీసుకెళ్లారు. నదిని పాత ప్రవాహ దిశలోకి మళ్లించే ప్రణాళికలపై చర్చించారు. అలాగే పెద్ద గనగళ్ళ పేటలో జట్టి నిర్మాణం, నాగావళి నది సముద్రంలో కలిసే చోట కోతను అరికట్టేందుకు అవసరమైన రక్షణ చర్యలపై కేంద్ర బృందం నిశితంగా పరిశీలించింది. ఎమ్మెల్యే శంకర్ ప్రత్యేక చొరవను ఎన్ఐఓటీ బృందం ఈ సందర్భంగా అభినందించింది. నివేదికలను త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి అందజేసి, పనులు వేగవంతం చేస్తామని హామీ ఇచ్చింది. తీర ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చూపిస్తున్న చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, తహసిల్దార్ చక్రవర్తి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ఎన్ఐఓటీ ప్రతినిధులు, అటవీ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, ఇతర రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



# క్రీడా స్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**✻ ఎమ్మెల్యేలు శంకర్, ఈశ్వరరావు ✻ శ్రీకాకుళం రీజనల్ లెవెల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ 2025 ✻ విజేతలకు బహుమతుల ప్రదానం**




**శ్రీకాకుళం, డిసెంబర్24(వార్త):** క్రీడా స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. బుధవారం శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్య శాఖ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ 2025 శ్రీకాకుళం జోనల్ లెవెల్ క్రీడల్లో అవార్డ్స్ ప్రధా నోత్సవ ప్రోగ్రాంలో వారు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే భవిష్యత్తులో ఉన్నత విద్యతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలకు క్రీడాకోటా ద్వారా పొందవచ్చన్నారు. వికసిత భారత్ 2047, స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 ఫలాలను అందుకోబోయే యువత అందరూ మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని, యువత ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని వారన్నారు. నైపుణ్య విద్యను అందిపుచ్చుకుంటే ఉపాధి అవకాశాలు ఉత్తరాంధ్రలోనే పుష్కల ంగా ఉన్నాయని, క్రీడల్లో మరింత రాణించి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. శ్రీకాకుళం జిల్లా రీజినల్ లెవెల్ క్రీడా పోటీల్లో ఐదు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, నాలుగు ప్రైవేట్ పాలిటెక్నిక్ కళా శాలల విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు, గ్రూపు క్రీడల్లో, వ్యక్తిగత క్రీడల్లో విద్యార్థులకు అవార్డులో ప్రశంస పత్రాలతో అభినందించారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్, పిడి, క్రీడాకారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎరువుల కొరత లేదు

**✻ 26వేల మెట్రిక్ టన్నుల ఎరువుల పంపిణీకి ప్రణాళిక ✻ జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్**



**శ్రీకాకుళం, డిసెంబర్24(వార్త):** జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత లేదని, రైతులకు అవసరమైన యూరియాను తగినంతగా అందుబాటులో ఉంచామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. 2025-26 రబీలో అన్ని రకాల పంటలకు గాను మొత్తం 26,000 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. అక్టోబరు 1 నుంచి ఈ నెల 23 వరకు జిల్లావ్యాప్తంగా 11,141 మెట్రిక్ టన్నుల విక్రయాలు జరిగాయని, ప్రస్తుతం వివిధ కేంద్రాల్లో 1,859 మెట్రిక్ టన్నుల నిల్వలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. దేశీయ ఉత్పత్తితో పాటు దిగుమతులు కూడా ఆశాజనకంగా ఉన్నందున రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. సాంప్రదాయ ఎరువులకు ప్రత్యామ్నాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న నానో యూరియా, నానో డి.ఎ.పిలను కూడా వినియోగించుకోవాలని, జిల్లాలోని కో-ఆపరేటివ్ సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, మార్క్ ఫెడ్ గోదాములు, ప్రైవేట్ రిటైల్/హోల్ సేల్ డీలర్ల వద్ద ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎరువుల విక్రయాల్లో డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించినా, ఇతర ప్రాంతాలకు మళ్లించినా లేదా ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించినా ఎరువుల నియంత్రణ చట్టం-1985 ప్రకారం లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. రైతులు బస్తాలపై ఉన్న ధరను గమనించి, కొనుగోలు చేసిన వెంటనే డీలర్ల నుంచి తప్పనిసరిగా రశీదు పొందాలని జేసీ సూచించారు.




## డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్ధ సత్వర పరిష్కారం

**శ్రీకాకుళం, డిసెంబర్24(వార్త):** జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్ధ, సత్వర పరిష్కారం జరుగుతుందని జిల్లా సివిల్ సప్లై అధికారి జి. సూర్య ప్రకాష్ తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్థానిక గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ (మెన్) సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఈ సమావేశంలో సభాధ్యక్షులు జి.సూర్యప్రసాద్, వినియోగదారుల హక్కుల గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమం 18వ తేదీ నుండి 24వ తేదీ వరకు జరుగుతుందని వినియోగదారుల హక్కుల కోసం చట్టబద్ధత కల్పించడం జరిగిందని, ఆ దినాన్నే జాతీయ వినియోగదారుల దినంగా డిసెంబరు 24న ప్రతిఏటా చేసుకుంటామని తెలిపారు. వినియోగదారునికి హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయని గుర్తు చేశారు. వాటిని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు లీగల్ మెట్రాలజీ, ఫుడ్ కంట్రోల్, డ్రగ్ కంట్రోల్, రోడ్డు రవాణా సంస్థ, జిల్లా కోఆర్డినేటర్ హాస్పిటల్స్, శాఖలకు సంబంధించి వినియోగదారులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. వినియోగదారులు కొనుగోలు చేయుచున్న ఏ వస్తువైన ధర, వాటిని తయారు చేయు డేట్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకొని కొనుగోలు చేయాలని సూచించారు. తూనికలు కొలతలకు సంబంధించి మోసాలను గమనించి వినియోగదారులు ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ పి.చిన్నమ్మ తెలిపారు. మనం తీసుకునే ఆహార వస్తువులు ఏది మంచో ఏది చెడు గ్రహించి చిరుతిండ్లుకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని వినియోగదారులు ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, లక్ష్మీనారాయణ తెలిపారు. డ్రగ్స్ కంట్రోల్ ఏడి హరిశ్చంద్ర రావు మాట్లాడుతూ క్వాలిటీ మెడిసిన్స్ విషయంలోనూ, కనీస అవసరాల మందులు స్టోరేజీ పరిశీలన, ఎమ్మార్పీ విషయాల్లో ప్రభుత్వం నిబంధనలకు అనుకూలంగా చేయుట జరుగుతుందని తెలిపారు. రోడ్డు రవాణా సంస్థ డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని సేవలు డిజిటల్ విధానంలోనే జరుగుతున్నాయని టిక్కెట్ రిజర్వేషన్ నుండి వస్తు సామాగ్రి తరలించేంత వరకు ప్రతీ విషయంలోనూ డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని సంస్థ ద్వారా అనేక సేవలు అందించుటలో కృతనిశ్చయంతో ఉన్నామని తెలిపారు. జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ అధ్యక్షులు ఆర్.చిరంజీవి మాట్లాడుతూ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. వినియోగదారుల హక్కుల గూర్చి తెలుసుకోవాలన్నారు. మొట్టమొదటిగా అమెరికా దేశంలో ప్రారంభమైన ఈ వినియోగదారుల హక్కుల పోరాటం, మన దేశ పార్లమెంట్లో 1996లో చట్టరూపం దాల్చిందని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెమొంటో, నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు వాజపేయి శతజయంతి



**శ్రీకాకుళం, డిసెంబర్ 24(వార్త):** మాజీ దేశ ప్రధాని, అజాత శత్రువు, భారత రత్న అటల్ బిహారీ వాజపేయి శత జయంతిని గురువారం శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని సూర్యమహల్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసి వాజపేయి విగ్రహానికి గురువారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు పూలమాల వేసి నివాళులు అర్పిస్తామన్నారు. బుధవారం బీజేపీ నాయకులు కొందరు వాజపేయి విగ్రహాన్ని శుభ్రం చేశారు. విగ్రహం ఆవరణను శుభ్రం చేసి రంగ వల్లులు వేశారు. వాజపేయి శత జయంతి కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

## మొదలవలసకు అభినందన వెల్లువలు

**శ్రీకాకుళం, డిసెంబర్24(వార్త):**



శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడుగా మొదలవలస రమేష్‌కు టీడీపీ అధిష్టానం నియమించిన విషయం విదితమే. ఈ పదవి కోసం అనేక మంది ఆశావాహులు పోటీపడ్డారని, చివరకు విధేయతకు బాధ్యతను అందించటం హర్షణీయమని శ్రీకాకుళం జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ పొన్నాడ రవి కుమార్ అన్నారు. బుధవారం మొదలవలస రమేష్‌ను పొన్నాడ రవి మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

**శ్రీకాకుళం, డిసెంబర్24(వార్త):** లావేరు మండలంలోని తాళ్ల వలస సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమా దంలో సుభద్రపురం గ్రామానికి చెందిన ఇజ్జాడా గణేష్ (19) తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. లావేరు పోలీసులు తెలిపిన వివ రాలిలా ఉన్నాయి. సుభద్రపురం గ్రామానికి చెందిన ఇజ్జాడా రమణ మంగళవారం కుమారుడు గణేష్‌తో కలిసి మోటారు బైక్‌పై రణస్థలం వైపు వెళుతుండగా తాళ్లవలస సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టారు. దీంతో గణేష్‌కు బలమైన గాయమైంది. వెంటనే శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని మెడికవర్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. లావేరు పోలీసులు కేసు నమోదు చేశారు.

## పర్యావరణ పరిరక్షణే రేపటి తరాలకు భద్రత




**శ్రీకాకుళం, డిసెంబర్24(వార్త):** నేటి పర్యావరణ పరిరక్షణే రేపటి తరాలకు భద్రతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్య దర్శి కె.హరిబాబు పేర్కొన్నారు. పాన్ ఇండియా ఎన్విరాన్‌మెంటల్ లీగల్ లిట రసీ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో పర్యావరణ, పారిశ్రామిక అధికారులకు అవగాహన సదస్సు నిర్వ హించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనల మేరకు ఏర్పాటు చేసిన ఈ సదస్సు లో ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాల నిర్వహణలో చట్టపరమైన నిబంధనలు పాటించడం అత్యవసరమన్నారు. పర్యావరణ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అధికారులను కోరారు. అనంతరం ఈ పథకానికి సంబంధించిన గోడ పత్రికను ఆయన విడుదల చేశారు. పరి శ్రమల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా వివరించారు. పర్యావరణాన్ని కలుషితం చేయడం వల్ల కలిగే చట్టపరమైన ఇబ్బందులను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలు ష్య నియంత్రణ మండలి ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కరుణశ్రీ, వివిధ పరి శ్రమల ప్రతినిధులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## మౌలిక సూత్రాలపై పట్టుంటేనే ఉజ్వల భవిష్యత్తు

**శ్రీకాకుళం, డిసెంబర్24(వార్త):** ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ రంగంలో రాణించాలనుకునే విద్యార్థులు మౌలిక సూత్రాలపై పటిష్టమైన పట్టు సాధించాలని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుని కష్టపడితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అలహాబాద్ మోతీలాల్ నెహ్రూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డొగ్గ రవీంద్ర పేర్కొన్నారు. ఎచ్చెర్ల, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'మోడలింగ్ అండ్ సిమ్యులేషన్ ఆఫ్ రిన్యూవబుల్ ఎనర్జీ సిస్టమ్స్' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అకాడమిక్ నైపుణ్యాలతో పాటు మ్యాట్‌ల్యాబ్ వంటి సాఫ్ట్‌వేర్లపై పట్టు సాధించడం వృత్తిపరంగా ఎంతో మేలు చేస్తుందన్నారు. 'రైట్ ఏజ్ - రైట్ టైమ్ - రైట్ డెసిషన్' అనే సూత్రాన్ని పాటిస్తూ అంకితభావంతో చదవాలని పిలుపునిచ్చారు. అకాడమిక్ డీన్ డాక్టర్ మేరుగు శివరామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన నిరంతర కృషిని అలవర్చుకోవాలని, నిర్ణయాత్మక శక్తి ఉంటే జీవితంలో ఏ లక్ష్యాన్నైనా చేరు కోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.బాలాజీ, పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, ఈఈఈ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

**✻ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**సంతబొమ్మాళి, డిసెంబర్24(వార్త):** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. బుధవారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలకు న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు అందుతున్నా యన్నారు. సంతబొమ్మాళి మండం కొత్తపల్లి గ్రామానికి భూ సర్వే చేపట్టాలని వినత పత్రం అందిందించారు. అలాగే నూతన పెన్షన్లు మంజూరు చేయాలని, నూతన గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరలోనే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధుల నిర్వహణలో అలసత్వం లేకుండా, బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546